క్లుప్తంగా

3న మండల సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 3న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రసాదరావు సోమవారం తెలిపారు. దీని పై ఇప్పటికే సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇచ్చామన్నారు. సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశానికి గైర్హజరాని అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. సమయ పాలన లేకుండా విధులు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన సోమవారం రింతాడ-1 సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీ-4ను విజయవంతం చేయాలన్నారు. పేదలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచి వ్యాధులకు దూరంగా ఉంచాలన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గడుగుపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరావు

పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ గాదేపల్లి, గడుగుపల్లి, లక్ష్మీపేట పంచాయతీ కేంద్రంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన శిబిరాల్లో సుమారు 164 మంది వైద్య పరీక్షలు చేసినట్టు వనవాసీ కళ్యాణ ఆశ్రమం చికిత్స ప్రముఖ్ డాక్టర్ డి.శ్రీనివాసరావు చెప్పా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనవాసీ కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఆయా శిబిరాల్లో పది మంది రోగులకు శస్త్రచికిత్స అవసరాల నిమిత్తం సిఫార్సు చేసినట్టు తెలిపారు. వైద్యాధికారి నిఖిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీ-4ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తహశీల్దార్ కన్నాజీరావు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కన్నాజీరావు సూచించారు. ఆయన సోమవారం రేషన్ డిపో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీ4లో భాగంగా బంగారు కుటుంబాలను తయారు చేయాలన్నారు. పేదలకు మార్గదర్శులుగా నిలవాలని కోరారు. డీలర్లు సమయపాలన పాటించి డిపోలను తెరవాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

ఎస్ఐగా సురేష్ బాధ్యతల స్వీకరణ



గూడెంకొత్తవీధి: గూడెం కొత్తవీధి ఎస్ఐగా కె.సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు విశాఖలోని టాస్క్‌ఫోర్స్‌లో పని చేశారు. బదిలీల్లో భాగంగా జీకే వీధికు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న అప్పలసూరిని పాడేరు స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ చేశారు. బాధ్యతల అనంతరం సురేష్ మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



డాక్టర్ దుర్గాప్రసాద్

ఎటపాక: వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, అప్రమత్తంగా ఉండాలని నెల్లిపాక పీహెచ్‌సీ వైద్యుడు దుర్గాప్రసాద్ సోమవారం సూచించారు. వర్షాలు కురుస్తుండడంతో మురుగునీటి నిల్వల్లో దోమలు పెరిగి ప్రజలు దోమకాటు కారణంగా వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరని చెప్పారు. విషజ్వరాలు, ఇతర అంటువ్యాధులు సోకిన సమయంలో తగు జాగ్రత్తలు పాటించి వైద్యచికిత్సలు పొందాలన్నారు.కాచిచల్లార్చిన నీటిని తాగటంతో పాటు వేడి ఆహార పదార్థాలనే తినాలని సూచించారు.రోగులు వైద్యుల సూచనలతో వైద్యం పొందాలని వ్యాధుల పట్ల అజాగ్రత్తగా ఉండకూడదని తెలిపారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- అస్తవ్యస్తంగా ఘాట్ రోడ్డు
- మలుపుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు
- అధ్వానంగా రహదారి
- పట్టించుకోని అధికారులు



గోతులమయంగా మారిన దారాలమ్మ ఘాట్ రోడ్డు



ఘాట్‌రోడ్డులో ప్రమాదకరంగా మలుపు

సీలేరు: సీలేరు నుంచి అంతర్రాష్ట్రాలకు వెళ్లే ఘాట్ రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తుంది. పెద్ద పెద్ద గోతులతో, రాళ్లు తేలిన ఈ దారిపై ప్రయాణం నరకయాతనగా మారింది. ఈ ఘాట్ రోడ్డుపై ప్రయాణానికి ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా పలువురు చెబుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోతులుగా 70 కిలోమీటర్లు

ఘాట్‌రోడ్డు సింగిల్ రోడ్డులో ప్రయాణం సాగిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గోతులుగా మారింది. ప్రయాణానికి ఇబ్బందులు గురిచేస్తుంది. పది రోజుల క్రితం బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన భారీగా వర్షాలకు ఈ రహదారి కోతకు గురై.. రాళ్లు తేలి పెద్ద పెద్ద గోతులుగా మారింది. దీంతో ఘాట్ రోడ్డు ప్రయాణం చేయడం అంటే నరకంగా మారుతుంది. గూడెం కొత్తవీధి మండలం ఆర్.వి.నగర్ నుంచి సీలేరు మీదుగా పాలగెడ్డ వరకు ఉన్న 70 కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. ఉన్న రోడ్డు బాగు చేయాలని ఇప్పటికే అనేకసార్లు ఉన్నతాధికారులకు వినతులిచ్చినా, భారీ ర్యాలీలు, ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేసినా అధికారు లు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు.. నీటి మూటలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను ఈ ఏడాది సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని ప్రగల్భాలు ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం హామీలు..నీటి మూటలని గిరిజనులు ఎద్దేవా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదికి పైగా కావస్తున్నా మన్యంలో రహదారి ముఖ్యంగా సీలేరులోని అంతర్రాష్ట్ర రహదారి పరిస్థితి ఎక్కడి వేసిని గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నట్టు చెబుతున్నారు. అధ్వాన ఘాట్ రోడ్డు కారణంతో ఈ ప్రాంతంలో తిరిగే ఆర్టీసీ బస్సులను పాడైపోతున్నాయని నిలిపివేశారు. రోడ్డు దారుణంగా ఉండడంతో పర్యాటకుల



ప్రమాదానికి గురై మృతి చెందిన గిరిజనుడు (ఫైల్)

సైతం రాక తగ్గిపోయింది.

అధికారుల నిర్లక్ష్యం


ఘాట్ రోడ్డు అంతలా రోడ్డుకు ఇరువైపులా భారీగా పిచ్చిమొక్కలు పెరిగాయి. రోడ్డుపైకి వచ్చేసాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లిలో ఆర్అండ్‌బీ శాఖ డివిజన్ అధికారులు ఉన్నప్పటికీ ఈ ఘాట్‌రోడ్డు దుస్థితిపై కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి, ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటుచేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

15 రోజుల కిందట దుప్పులవాడ పంచాయతీ గొందిపాలెం గ్రామానికి చెందిన బురిడీ అనే యువకుడు బైక్ మీద వస్తుండగా ఆకస్మాత్తుగా ప్రమాదం జరిగి గాయపడ్డాడు. కేజీహెచ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.మండలంలో కడుగుల రహదారి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాకూరి దారబాబు తీవ్ర గాయాలయ్యాయి.

నెలరోజుల కిందట గూడెం మండలం మునిమెట్ట మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర ఢీకొని ఇద్దరి వ్యక్తులు మృతి చెందారు. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నా రోడ్డు మరమ్మతకు కూటమి ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు



ఆర్.వి.నగర్ నుంచి సీలేరు వరకు దెబ్బతిన్న రహదారిని తక్షణమే బాగుచేయాలి. కొత్త రోడ్డు వేయాలి. లేకపోతే ఆందోళన చేస్తాం. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మరణించి బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గిరిజన గ్రామాల రోడ్లపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది.

– సాంబమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు, సీలేరు

తుప్పలను తొలగించాలి



ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు బాగా పెరిగిపోయాయి. రోడ్డు పైకి వేలాడుతున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే పిచ్చిమొక్కలు, తుప్పలన తొలగించాలి.

– కుమార్, ప్రయాణికుడు

29న దివ్యాంగ పింఛన్‌దారుల ర్యాలీ



మాట్లాడుతున్న దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు రవికుమార్, కొండబాబు

పాడేరు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న పాడేరు భారీ నిరసన ర్యాలీ చేపడుతున్నట్టు సంఘం అధ్యక్షుడు జన్ని రవికుమార్, ప్రధాన కార్యదర్శి కొండబాబు తెలిపారు.వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతు కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌దారులపై తప్పుడ వ్యాఖ్యలు చేస్తూ దొంగ ధృవపత్రాలతో పింఛన్ పొందుతున్నారని చెప్పడం విడ్డూరమన్నారు. అర్హులై ఉండి కొన్నేళ్లు పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు అక్రమంగా పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలన్నారు, అర్హులైన దివ్యాంగులకు రద్దు చేసిన పింఛన్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పట్ల ప్రదర్శిస్తున్న నిరంకుశత్వాన్ని నిరసిస్తూ పాడేరులో శుక్రవారం చేపట్టనున్న ర్యాలీకి అందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదివాసీలపై నిర్లక్ష్యం తగదు

రంపచోడవరం: ఆదివాసీలపై ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యం తగదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు చెప్పారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆదివాసీలకు ఉపయోగపడే విధంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి సర్కారు భవనం అందుబాటులో ఉండేలా అధికారులు చూడాలని కోరారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు ఆదివాసీల సమస్యలపై స్పందించాలన్నారు రంపచోడవరం వైటీసీలో శనివారం జరిగిన సంఘటనపై పూర్తి దర్యాప్తు చేసి బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆదివాసీలతో ఐటీడీఏను ముట్టడిస్తామని హెచ్చరించారు.

మొక్కల పంపిణీ



మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎటపాక: ఐటీసీ సహకారంతో సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పండ్లు, అడవి జాతి మొక్కలను పంపిణీ చేశారు. మండలంలోని బుట్టాయిగూడెం మయూరి నర్సరీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిషత్ ఉప అధికారి శ్రీనివాస్, అటవీ శాఖ సెక్షన్ అధికారి సతీష్ రైతులకు మొక్కలు అందజేశా రు. ఐటీసీ బంగారు భవిష్యత్ మేనేజర్ సాగర్, స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణకిశోర్, సిబ్బంది ఉన్నారు.

డుంబ్రిగుడ: మొక్కలు నాటి పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు రక్షించాలని అరకులోయ సీఐ హిమగిరి అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని లైగండ పంచాయతీ కేంద్రంలో వీఆర్పీ రాజులు ఆధ్వర్యంలో అరకులోయ సీఐ



లైగండలో మొక్కలు పంపిణీ చేస్తున్న అరకులోయ సీఐ హిమగిరి

హిమగిరి చేతులు మీదుగా లబ్ధిదారులకు సిల్వర్ ఓక్ తదితర మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ ప్రస్తుతం అంతరించిపోతున్న అడవులను కాపాడేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ఉపాధి హామి పథకంలో భాగంగా అందించిన వివిధ మొక్కలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. పోలీసు సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

కొయ్యూరు: రైతులు విధిగా ఈ-పంటను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాదికారి ఐ.భాను ప్రియాంక సూచించారు. మండలంలోని సింగవరం రైతు సేవా కేంద్రంలో సోమవారం ఉద్యాన, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది విధిగా రైతుల వద్దకు వెళ్లి ఈ-పంట నమోదు చేయాలని సూచించారు. దీంతో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు సాగులో మెలకువలను పాటించాల, రసాయన ఎరువులకు స్వస్తి పలికి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కూరగాయల పంపిణీ



కూరగాయలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామారావు, ఎస్‌డీసీ చంద్రశేఖర్

వీఆర్‌పురం: వరద బాధితులకు కూరగాయలను చింతరేవుపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, ఎస్‌డీసీ చంద్రశేఖర్ సోమవారం పంపిణీ చేశారు. చింతరేవుపల్లి పంచాయతీ పరిధిలోని ప్రత్తిపాక, గుండుగూడెం, చింతరేవుపల్లి, తుష్టివారిగూడెం, కన్నాయిగూడెం తదితర గ్రామాల్లో వారు సోమవారం పర్యటించి, బాధితులకు కూరగాయలను అందజేశారు. పీసా కమిటీ ఉపాధ్యక్షులు జయరాజు, మురళీ, రామారావు, నవీన్ కుమార్, ముత్యాలరావు, రవి, బాలరాజు, వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ సత్యనారాయణ , వీఆర్వో వినోద్, వీఆర్ఏ ప్రసాద్ పాల్గొన్నారు.

కళాశాలలో క్రీడాపోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ తదితరులు

అరకులోయటౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని (ఆగస్టు 29) పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం క్రీడా పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ప్రారంభించారు. పిడి ఎస్.అప్పారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పి.నాగబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు పర్యవేక్షణలో వాలీబాల్, కబడ్డీ, షటిల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు జాతీయ స్పోర్ట్స్‌డే రోజున బహుమతులు అందజేయనున్నారు.

గిరి గ్రామాల్లో మట్టి విగ్రహాల పంపిణీ

మండలంలోని గద్యగుడ, శిమిలిగుడ, స్వర్ణాయిగుడ, నియాలిగుడ గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 50 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడిని పూజించాలని ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మీ, పి.అనితకుమారి, వలంటీర్లు గిరిజనులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు గణేష్, రాజు, కృష్ణామోహన్, లచ్చన్న, కామేశ్వరరావు, సోంబాబు, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.



గద్యగుడలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

చింతపల్లి: మండల కేంద్రంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మాన్‌సూన్ హైజీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాలలోని స్వచ్ఛత కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రోగాలు నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుందన్నారు. అధ్యాపకులు రవీంద్ర నాయక్, ఈశ్వర్, సతీష్, పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గంగవరం : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనం నడిపినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. గంగవరం సెంటర్‌లో ఆయన సిబ్బందితో కలిసి సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. యువతతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెలలో ఇప్పటివరకు నిర్వహించిన వాహన తనిఖీల్లో వాహన పత్రాలు లేక, హెల్మెట్ ధరించక, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై 52 చలానాలను విధించి, సుమారు రూ.45వేల జరిమానా వసూలు చేసినట్టు చెప్పారు. ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి రోడ్డు ప్రమాదాలు నివారణపై అవగాహన కల్పించామన్నారు. ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



గంగవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటేష్


వినాయక ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఎటపాకలో విగ్రహాల అమ్మకాలు

ఎటపాక: జై బోలో గణేష్ మహరాజ్‌కి జై...అంటూ ఊరూరా సందడి మొదలైంది. బుధవారం నుంచి ప్రారంభమవుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు సర్వం సిద్ధం చేశాయి. పల్లెల్లో వాడ వాడలా భక్తుల పూజలందుకునేందుకు బొజ్జ గణపయ్య సిద్ధమయ్యాడు. వినాయకుడిని ప్రతిష్ఠించేందుకు కమిటీలు ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి అందంగా అలంకరించారు. మండపాల వద్ద విద్యుత్‌దీపాలను, మైకులను కూడా ఏర్పాటుచేస్తున్నారు. మండపాల్లో కొలువు చేసేందుకు సమీపంలోని తెలంగాణ రాష్ట్రం భద్రాచలం పట్టణం, ఎటపాకలో వివిధ రూపాల్లో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలను ముందుగానే కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఆయా విగ్రహాలను సోమవారం ఉదయం నుంచే ట్రాక్టర్లు, వ్యానులు, ఆటోల్లో గ్రామాలకు కమిటీలు తరలించారు. గణపయ్యను మండపంలో ఉంచి పూజలు చేసేందుకు అవసరమైన పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే పర్యావరణ ప్రేమికులు, ఇంట్లో పూజలు చేసుకునే మహిళలు మట్టి విగ్రహాలను కొనేందుకు ఇష్టపడుతున్నారు. ఇందుకోసం మట్టితో తయారు చేసి రంగులు వేసిన గణనాథులను పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



ప్రసాదరావునకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

పెదబయలు: పెదబయలు మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా నరంజీ ప్రసాదరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ కార్యదర్శి రాంబాబు, నాయకులు కొండయ్య, చిన్ని, , లోయికోన్, పృధ్వీరాజ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు

గూడెంకొత్తవీధి: మండలంలోని శంకాడ పంచాయతీ నిమ్మలపాలెంలో దేవరాపల్లి ఎంపీటీసీ సభ్యుడు పోతురాజు కృష్ణమూర్తికి చెందిన ఇంటిపై చెట్టు కూలింది. దీంతో ఇంటిపై కప్పు దెబ్బతింది. ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకొని, గృహ ప్రవేశానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో ఇంటిపై చెట్టు కూలి పైకప్పు రేకులు విరిగిపోయాయి. ఈ సంఘటన తనకు ఆవేదనకు గురిచేసినట్టు ఎంపీటీసీ సభ్యుడు పోతురాజు చెప్పారు.



దెబ్బతిన్న ఇంటి పైకప్పు

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకుడ్రగ్స్ అనర్థాలపై ఈగల్ క్లబ్ ప్రతినిధులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని సూచించారు. మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రజలకు చైతన్యం తీసుకురావలన్నారు. విద్యార్థులు చదువుతోనే ఉన్నస్థాయిలో రాణించగలరన్నారు. పోలీస్ శాఖ ఈగల్ క్లబ్ సభ్యులు ధనుంజయ్‌నాయుడు, శివశంకర్‌నాయక్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఈగల్ క్లబ్ ప్రతినిధులు

ప్రశాంతంగా పీసా కమిటీ ఎన్నికలు



డుంబ్రిగుడలో ఎన్నికల అధికారి నుంచి నియామకపత్రాలు పొందుతున్న సభ్యులు

డుంబ్రిగుడ: జిల్లాలో పలు పంచాయతీల్లో సోమవారం జరిగిన పీసా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఇందులో భాగంగా డుంబ్రిగుడ మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ఎన్నికల అధికారి జె.కళావతి ఆధ్వర్యంలో పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ ఉపాధ్యక్షుడిగా టి సూర్యనారాయణ,, ప్రధాన కార్యదర్శిగా రామ్మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కాడెల్లిలో ఎన్నికైన సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న ఈవోపీఆర్డీ రమేష్

పాడేరు రూరల్: మండలంలో కాడెలి పంచాయతీ వర్తనపల్లి గ్రామంలో ఈవోపీఆర్డీ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పీసా కమిటీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. పీసా కమిటీ కార్యదర్శిగా తిరుపతిరావు ఎన్నికయ్యారు. పంచాయతీ, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నగెడ్డలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మోహన్‌ను అభినందిస్తున్న సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: మండలంలో పీసా కమిటీ ఎన్నికలు 14 ప్రాంతాల్లో ప్రశాంతంగా జరగ్గా, తాజంగి, ఎర్రవరం కోరం లేక వాయిదా పడినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఎన్నికైన వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.